# మధ్యవర్తి

సుధీర్ మెహ్తా హస్పిటల్లోఉన్నాడు. అతడికి కారుప్రమాదంలో ఎడమ చెయ్యి బుజందగ్గరనుంచి మణికట్టువరకూ ఎముక నాలుగుముక్కలయిందని ఎక్సురే తీసిన డాక్టరుచెప్పాడు. చేతికి ప్లాస్టరు వేయించుకుని ఇంటికి రావాలనుకున్నాడు. కాని కొన్నిరోజులయిన తరువాత మళ్ళీ ఎక్సురే తియ్యాలని డాక్టరు అనటంచేత అక్కడే ఉండిపొయ్యాడు. హాస్పిటల్ కి ఇంటికి చాలాదూరం. రాకపోకల శ్రమతప్పుతుందని ఈ నిర్ణయానికివచ్చాడు. ప్రత్యేకంగా రూమ్ తీసుకున్నాడు కనుక అతడికి వసతిగాకూడా ఉంది. తల్లి ఉదయం పదకొండుగంటలకు భోజనం తీసుకువచ్చి నాలుగుగంటలవరకూ ఉండేది. తను ఇంటికి వెళ్ళినప్పుడు ఒక నౌకర్ని ఉంచేది-అతడిదగ్గర.

హాస్పిటల్లో మళ్ళీ ఎక్సురే తీశారు. కొన్నిభాగాలు సరిగా అతుక్కోలేదని మళ్ళీ ప్లాస్టరు వేశారు. సుధీర్ మెహ్తా వాళ్ళుచెప్పిన రోజుకువచ్చి ఎక్సురే తీయించుకుంటాననిచెప్పి ఇంటికివచ్చాడు.

తల్లి అతడికి గదిలో హాస్పిటల్లో ఏర్పరచిన వసతులన్నీ ఏర్పరచింది. ప్రత్యేకంగా ఒక నౌకర్నికూడా నియమించింది. పదిరోజులయిన తరువాత హాస్పిటల్లో మళ్ళీ ఎక్సురే తీసి ప్లాస్టర్ని తీసేశారు.

"ఈ చేత్తో బరువుపని చేయకండి. మీరు ఫిజీయోథిరపీ తీసుకుంటే చెయ్యి మామూలుగా చాపగలుగుతారు." అని డాక్టరు సలహాఇచ్చాడు.

సుధీర్ మెహ్తా మళ్ళీ హాస్పిటల్ వెళ్ళదలచుకోక దగ్గరలో ఉన్న నర్సింగ్ హోమ్ లో ఫిజియోథిరపీ తీసుకోవటం మొదలుపెట్టాడు కాని అతడి చెయ్యినొప్పి మాత్రం తగ్గలేదు. చెయ్యి పూర్తిగా చాపలేకపోతున్నాడు.

మెహ్తాకు కుట్టినబట్టలు విదేశాలకు ఎగుమతిచేసే ఏజన్సీ ఉంది. ఈ దేశం నుంచి రెడీమేడ్ డ్రెస్సులు విదేశాలకు ఎగుమతిచేస్తూ ఉంటాడు. అతడికి ఆ

యింటికి సమీపంలోనే ఆఫీసుఉంది. ఒకస్టెనో, ఇద్దరు గుమాస్తాలు, పేక్ చేసి పంపించే నౌకర్లూ ఉన్నారు.

మెహ్తాకు కారుప్రమాదం జరిగినప్పటినుంచీ ఎగుమతుల వ్యవహారం సరిగా జరగటంలేదు. వసూళ్ళయిన డబ్బు బ్యాంకుకు సరిగా చేరటంలేదు. అతడి ఆఫీసుస్టాఫ్ అతడున్నప్పుడు భయభక్తులతో పనిచేసినవారే. కాని-వాళ్ళల్లో ఇప్పుడు స్తబ్ధత పెరిగిపోయింది. సరుకులు వేళకు అందటంలేదని విదేశీవర్తకులు ఉత్తరాలు రాస్తున్నారు. ఇవన్నీ తలుచుకున్నప్పుడు మెహ్తా వ్యాపారం సరిగా సాగటంలేదని విచారపడతాడు.

కాని చెయ్యినొప్పి తగ్గటంలేదు. ఆ బాధతో ఏమీ ఆలోచించలేక పోతున్నాడు.

నెలలు గడుస్తున్నాయి.

అతడి తల్లికి తన కొడుకు వ్యాపారం నష్టమైపోతున్నదన్న బాధ కడుపులో ఉన్నది. అలా ఎందుకు నష్టంవస్తున్నదో దానికి కారణం కూడా కడుపులోనే బాధిస్తున్నది. అప్పుడప్పుడు ''నీవా పిల్లను గౌరవప్రతిష్ఠలు చూడకుండా పెళ్ళిచేసుకున్నావు. దానిపాదం మంచిదికాదు. ఆ పుట్టిన పిల్లవాడు పుట్టినవేళ కూడా మంచిదికాదని తెలిసిన పండితులన్నారు. మన సంసారం బాగుపడాలంటే-నీ వ్యాపారం ఇదివరలో మాదిరి ఎగుమతులు బాగా సాగాలంటే-ఆ పిల్లవాడినీ తల్లినీ ఇంటికి తీసుకురాబోకు. నీకు మంచికుటుంబంలోనుంచి అందమైన పిల్లను తీసుకువచ్చి పెళ్ళిచేస్తాను'' అంటూ ఉంటుంది.

అతడు ''నా చెయ్యినొప్పి తగ్గనీయమ్మా. వ్యాపారం అదే బాగుపడుతుంది. అసలు నేను కొంతకాలం ఇంట్లో ఆఫీసు పెట్టుకుందామనుకుంటున్నాను. అవతలి పోర్షను ఖాళీచేయించు" అన్నాడొకరోజు.

"అవును. మనయిల్లే ఉండగా వేరే ఆఫీసుకు ఐదువందలు అద్దెపెట్టటమెందుకు? అదయినా ఏమంత పెద్దదనీ? ఒక్క ఆఫీసురూమే పెద్దది. మిగతా గదీ వరెండా మరీచిన్నది. ఆఫీసు మూసేస్తానని ఇంటివాళ్ళకు ఉత్తరం రాయి. మనయింట్లో ఉన్నవాళ్ళను నెలాఖరికి ఖాళీచేయమని నోటీసు పంపించు" అన్నది తల్లి.

వెంటనే స్టెనోను పిలిచి రెండు నోటీసులు డిక్టేట్ చేసి టైపుచేసి తీసుకు రమ్మనమన్నాడు.

నోటీసులు రెండూ అవతలివాళ్ళకు చేరాయి. ఆఫీసు ఇంట్లోనే అవతలి భాగంలోకి వచ్చింది.

ఒక వారంలోపునే విదేశీ వర్తకులకు సరుకులు పంపుతున్నామన్న ఉత్తరాలు పదిహేను వెళ్ళాయి. రెడీమేడ్ బట్టలకు ఆర్డర్లు వచ్చాయి. మెల్లగా సరుకు ఎగుమతులు చేయటమే కాకుండా బట్టలను దిగుమతి చేసుకుని కుట్టించటం పద్ధతిని కూడా తిరిగి ప్రారంభించాడు.

వ్యాపారం మీద మనసు కేంద్రీకృతమవటంచేత అతడికి చెయ్యినొప్పి తెలియటంలేదు. అప్పుడప్పుడు కుడిచేత్తో ఎడమచేతిని నొక్కుకుంటూ ఉంటాడు.

మెహ్తాకు దాదాపు నలభై అయిదు సంవత్సరాలున్నాయి. వ్యాపారం తిరిగి వెనకటికంటె కూడా బాగా వృద్ధిచెందుతున్నది. ఈ స్థితిలో స్టెనో మెహ్తా ఒంటరిగా ఉన్నప్పుడు అతడి గదిలోకి వెళ్ళి "ఏమయినా పనుందాసార్ ?" అని అడిగేది. తన పని అయినా మెహ్తా గదిలోనుంచి తొందరగా బైటికివచ్చేదికాదు.

''సర్, మీరు అప్పుడప్పుడు సినెమాకు వెళ్ళటం క్లబ్‌కి వెళ్ళటం మొదలు పెట్టాలి. పగలంతా వ్యాపారం విషయాలను గురించి అదేపనిగా ఆలోచిస్తూఉంటే మనసు ఆహ్లాదకరంగా ఉంటుందా ? కారుకూడా రిపేరయివచ్చింది. అమ్మగారిని తీసుకుని అలా బైటికివెళ్ళి చూడండి. ఒకరోజు ?" అనటం మొదలుపెట్టింది. తల్లిరాదుకనుక తనువెళ్ళవచ్చునన్న ఆశతో.

అతడికి కాఫీ టిఫిన్ నౌకరు చేతిలోనుంచి తీసుకుని తనే ఇవ్వటం మొదలుపెట్టింది ఆఫీసులో.

మెహ్తా "నీపని చూసుకో" అని అనాలనుకుంటాడు. మళ్ళీ ఎందుకో ఆగిపోతాడు.

స్టెనో ఇంకొక అడుగు ముందుకువేసింది. మెహ్తా తల్లిదగ్గరికెళ్ళి "సాబ్‌కు రోజూ ఇంటి టిఫిన్లు తినితిని విసుగుపుట్టిందట. రేపు నేను ఇంటిదగ్గర్నుంచి తీసుకురానా ? షాపునుంచి తీసుకురానా ?'' అని ఒకటిరెండుసార్లు అన్నది

కొడుకు పెళ్ళి విషయంలో ఆలోచనలుచేస్తూ పిల్లలను విచారిస్తున్న తల్లికి ఈ మాటలు వెగటనిపించాయి.

"నీపని వంటచేయటం టిఫిన్లుచేయటం లేకపోతే బజారునుంచి తీసుకు రావటంకాదు. నా కొడుకు స్వంత విషయాలలో జోక్యం కలిగించుకుంటే నీకు ఉద్యోగం ఊడిపోతుంది జాగ్రత్త" తల ఎత్తకుండా చివాట్లుపెట్టింది. మెహ్తాకూడా విసుక్కోవటం మొదలుపెట్టాడు. స్టెనో అభిమానం దెబ్బతిన్నది. ఆమె ఈ ఉద్యోగం వదలుకొని మరొకరి దగ్గర కుదిరింది.

మెహ్తా భార్యపేరు చంద్రిక. ఆమె ఉన్నంతకాలమూ అతడికి వ్యవహారం చాలా సులభంగా సాగిపోయేది. పదిగంటలకు ఇంట్లో పనిముగించి, మెహ్తా డిక్టేట్ చేసిన ఉత్తరాలను గబగబా టైపుచేసి అతడికి చూపించి సంతకంచేసిన ఉత్తరాలను పోస్టుచేయించేది. భార్యాభర్తలూ తల్లిముగ్గురూ ఒంటిగంటకు భోజనం చేసేవారు. ముగ్గురూ మూడుగంటలవరకూ విశ్రాంతి తీసుకునేవారు. అందరూ టీ తాగిన తరువాత మళ్ళీ ఆఫీసుగదిలో కూర్చుని గుమాస్తాలచేత సరుకులు ఎప్పుడు ఎవరికి ఎగుమతి చేసినదీ తేదీలతోకూడా లెక్కలు రాయించేది. రెండవ అతడిచేత దిగుమతి అయిన సరుకు టైలర్ల దగ్గరికి ఎప్పుడుపంపినది వివరాలు రాయించేది. తను-డబ్బు ఎక్కడినుంచి ఎప్పుడు వచ్చినదీ లెక్కలురాసేది. వచ్చిన చెక్కులు బ్యాంకులో జమచేసేది. ఆమె ఏపని చేసినా ఎంతోచక్కగా వంకపెట్టకుండా చేసేది.

"ఆ చంద్రిక లేకపోవటం చేతనే నాకిన్ని కష్టాలు వచ్చాయ"ని మనసులో బాధపడేవాడు. పట్టలేక కన్నీరుకార్చేవాడు ఒకోరోజు, మెహ్తా.

పుట్టిన పిల్లవాడు ఎట్లాఉంటాడు ?

"అందరిలా ఉంటాడా ? ఆఁహాఁ. ఉండడు. చందమామలా ఉంటాడు. ఈ పాటికి పెద్దవాడై ఉంటాడు. చదువుతున్నాడేమో? పెరిగిన తరువాత కాలేజికి వెళ్ళేఉంటాడు. తల్లి అతడిని పెద్దచదువులే చదివించి ఉంటుంది. ఆమె వ్యాపార సరళి తెలిసినది. లౌకికజ్ఞానం కలిగినది. పిల్లవాడిని బాగా చదివిస్తూనే ఉంటుంది.

అన్నట్టు-ఎక్కడైనా ఉద్యోగం చేస్తున్నదేమో ? చెయ్యకపోతే ఇద్దరి జీవితాలు ఎట్లా గడుస్తాయి ? ఆమెకు ఆలోచన ఎక్కువ. పిల్లవాడిని పెంచాలనే

ఉద్దేశ్యం కలగదా ? అందుకు ఉద్యోగం చెయ్యదా ? చేస్తూనే ఉంటుంది" అనుకుంటాడు ఆఫీసులో కూర్చున్నప్పుడు అతడికి చేతిబాధ ఎక్కువైనప్పుడు ఆమె మీదికి ధ్యాసమళ్ళుతుంది.

ఉన్నట్టుండి మెహ్తా తల్లికి దగ్గు జ్వరం ముంచుకువచ్చింది. ఆ మహానగరంలో డాక్టరు ఇంటికి రావటమంటే సామాన్యం కాదు." చిన్న విషయానికి వందలకు వందలు ఖర్చుచేయిస్తారు." అని గుమస్తాను "ఒక డాక్టర్ని పిలుచుకురా ? అమ్మకు జ్వరంవచ్చింది" అని పంపించాడు.

అక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఒకపెద్ద కాలనీ ఉంది. అక్కడ ఏడెనిమిది అంతస్తుల మేడలే ఎక్కువ ఉన్నాయి. ఆ మేడల పక్కన ఒకచిన్న యిల్లు. ఇద్దరు ఉండటానికి రెండు పడకగదులు వాటికి కలిసినవే బాత్‌రూములు, ఒక హాలు, ఒకవంట ఇల్లు. అన్ని గదులకంటె పెద్దది-దానిలో సగం వంట స్టోరు, మిగతా భాగం భోజనాలకు ఏర్పాటుగా ఉంది. ఇంటికి ముందూ వెనుకా వరెండాలూ వాటికి గ్రిల్సు ముచ్చటగా ఉంది. ఆధునిక సౌకర్యాలు టెలిఫోను వంటి సౌకర్యాలన్నీ సమకూర్చబడ్డాయి. ఆ యింట్లో నౌకర్లులేరు. ఆ యిద్దరి పని ఆమె అవలీలగా చేసుకుంటుంది. కొడుకును అల్లారుముద్దుగా పెంచుకుంటున్నది. ముద్దుగా అశోక్ అని పేరుపెట్టుకుంది.

అశోక్ స్కూలుకు వెళ్లేరోజులలో అప్పుడప్పుడు ''అమ్మా ! నాన్న ఎట్లా ఉంటాడు ?" అని అడిగేవాడు.

"ఎందుకురా ఇప్పుడా ప్రశ్న ? వారంరోజుల్లో పరీక్షలు పెట్టుకుని నాన్నను గురించి ఆలోచిస్తావా ?" అన్నది మందలిస్తూ.

"ఆఁ! పరీక్షలకు బాగా చదివాను. ఇంకా చదువుతున్నాను. నాకు పరీక్షలంటే భయమనుకున్నావా ?''

''అయితే అవసరమైన ఆలోచనలు పెట్టుకోకు. ఇంకేదయినా చదువుకో. అదీ కాకపోతే స్నేహితుల దగ్గరకెళ్ళి కొంతసేపు నీకిష్టమైన క్రికెట్ ఆడుకో. అలా కాసేపు తిరిగిరా చల్లగాలికి" అనేది.

అతడికి పది పన్నెండేళ్ళు దాటిన తరువాత.

"అమ్మా, మనయింటికి ఎవరూ రారేం ? మనకెవరూ లేరా ?" అడుగుతూ ఉండేవాడు.

"ఊరికే వస్తూపోతూ ఉండటానికి ఎవరికి తీరుబడి ఉన్నది ? అందులో ఈ మహానగరానికి వచ్చి అందరూ ఉండలేరు. మనయిల్లు ఒక చిన్నపెట్టె మాదిరిగా ఉంటుంది. అందుకే ఎవరూ రారు."

"పోనీ సెలవుల్లో మనంవెళ్ళితే ?"

"పెద్దవాడవయిన తరువాత నిన్ను పంపుతాను. నాలుగుఊళ్ళు చూసిరా. కాని నిజంగా మనకెవరులేరు. వెళ్ళాలంటే వెళ్ళు. ఊళ్ళుచూసిరా."

"మనకు దగ్గరవాళ్ళు ఎవరూలేరా అమ్మా ?"

"దగ్గరవాళ్ళంటే ఎవరు ?"

"అంటే-నీకు అమ్మా నాన్నలేరా ? అక్కలు అన్నలూ ఎవరూలేరా ? అమ్మా.... నాకయినా తండ్రీ తాత బామ్మ అత్తలూ బాబాయిలూ లేరా? వాళ్లయినా రారేం ?"

"ఇది మహానగరం. అన్నిటికీ దూరం. ఇంతదూరం రావటానికి డబ్బు కావాలా ? అందరి దగ్గరా డబ్బుంటుందా ? ఏదో కొద్దిడబ్బుతో జీవితాలను గడుపుకునేవాళ్ళు. అదీగాక-పల్లెటూరి సౌకర్యాలు మనకెక్కడివి ? స్వచ్ఛమైన పాలు, తాజాకూరలు, గడ్డపెరుగు చల్లటి పైరుగాలి-అటువంటి సౌఖ్యాలు ఇక్కడ మనమ కల్పించగలమా ? అయినా ఆ సంగతులన్నీ ఇప్పుడెందుకుగాని, కొంచెం సేపు ప్లేగ్రౌండులో ఎవరున్నారో-ఏం చేస్తున్నారో చూసిరా" అని విషయాన్ని కబుర్లతో ఏమారుస్తుంది.

"అబ్బ ! ఎప్పుడూఇంతే నీవు" అంటాడు.

చూస్తూ ఉండగానే అతడు కాలేజి చదువులకు వచ్చాడు.

స్కూల్లో చదివేటప్పుడు అతడి గార్డియన్ యస్. మెహ్రా., అదే కాలేజీలో కూడా కొనసాగుతున్నది ఇంటర్ పూర్తిచేశాడు తల్లి అనుమతితోనే మెడికల్ కాలేజికి వచ్చాడు.

అతడికి ఆమె ఏమీలోపం రానీయదు. కాలేజిలో-అందులో మెడికల్ కాలేజీలో చదువుతున్నాడని మంచిమంచి బట్టలు కుట్టిస్తుంది. మంచిరకం కాలి జోళ్ళు కొనిస్తుంది. అతడికి కావలసిన పుస్తకాలు కొనుక్కోమంటుంది. దేనికి లోటు రానివ్వదు.

అతడికీ స్నేహితులున్నారు. పిక్‌నిక్‌లూ ఉన్నాయి. స్టడీటూర్లు ఉన్నాయి. టూర్‌ప్రోగ్రాములు ఉన్నాయి.

కాని-అతడి మనసులో ఏదోలోటు బాధిస్తుంది.

చదువు-మార్కులు-పోటీలు-వీటిలో అది అడుగున పడిపోతుంది-అతడి బాధ.

చంద్రిక అశోక్ పుట్టకముందు ఒక కంపెనీలో పనిచేసేది-ఒక్కమాట అనిపించుకోకుండా. ఆ ఆఫీసులో ఎనిమిదేళ్ళు పనిచేసి మంచి అనుభవం సంపాదించింది. డబ్బు జాగ్రత్తగా వాడుకుని మిగిలినది కూడబెట్టింది.

అతడు కాలేజిలో చేరాడు. పుస్తకాలు కొనుక్కున్నాడు. బట్టలు కుట్టించుకున్నాడు. అతడు తల్లికి ముద్దుబిడ్డ, అప్పుడప్పుడు టిల్లూ అని పిలుస్తుంది.

టిల్లూ కాలేజికి వెళ్ళిన తరువాత ఆమె తను భోజనంచేసి-ఇల్లు శుభ్రం చేసుకుని, స్టోర్‌లోనుంచి స్వెట్టర్‌లుకుట్టే మెషీను బైటికితీస్తుంది. సైజువారీగా స్వెట్టర్లు అన్నిరకాల ఫాషెన్లలో కుడుతుంది. ఒక డజన్ అయిన తరువాత వాటిని సూట్‌కేసులో పెట్టుకుని, టిల్లూకి చాలని బట్టలు మడతచేసి, అతడికి అవసరంలేని పుస్తకాలు అన్నీ సంచిలో సర్దుకొని ఇంటికి తాళంవేసి రెడీమేడ్ షాపుల్లో స్వెట్టర్లు ఇచ్చి డబ్బు తీసుకుంటుంది. పాతబట్టలూ, పాతపుస్తకాలు ఆయా అంగళ్ళలో అమ్ముతుంది. ఇంటికి వచ్చేటప్పుడు అవసరమైన వస్తువులు కొనుక్కొస్తుంది.

ఆమె పనిచేస్తూనే రేడియోలో, టీ. వీ.లో చెప్పిన రాజకీయవార్తలు వింటుంది. వాటిలో ఆమెకు మంచి అవగాహన ఉంది. అభిప్రాయాలు కచ్చితంగా ఉంటాయి. గొప్పెదాటుగా ఉండవు. ఆర్థిక విషయాలలో దేశం బాగుపడాలంటే పొదుపుచెయ్యాలి. పొదుపు ఎక్కడినుంచి ప్రారంభించాలి? సారా నిషేధమంటే

ముంతలలో తాగేవాడి కేనా ? సీసాలతో ఫ్రిజ్‌లో పెట్టుకుని జిన్ తీసుకుని తాగే వాళ్ళ మాటేమిటి ? వాళ్ళకు నిషేధం లేదా ? పొదుపు పైనుంచి చేసుకుంటూ రావాలి, గాని కిందినుంచి కాదు. "యథారాజా తథా ప్రజా'' అన్నట్టుగా ఈ విధ మైన కచ్చితమైన అభిప్రాయాలు గలది.

తల్లీకొడుకులు తీరిక సమయాలలో ఇటువంటి విషయాలను చర్చించు కుంటారు. సాంఘిక విషయాలు, అన్యాయాలు, దోపిడీలు, క్రీడలు, సినెమాలు వాటి తీరుతెన్నులు చర్చించుకుంటారు, గాని మరొక విషయాన్ని ఆ చర్చల్లో దూరనీయరు.

అశోక్ చూస్తూఉండగానే మెడికల్ కోర్సు పూర్తిచేశాడు. పై చదువులు చదవాలన్న ఆశ. విదేశాలకు అప్లికేషన్లుపోతున్నాయి. జవాబులకు ఎదురుతెన్నులు చూస్తున్నాడు.

ఆ తరుణంలో సుధీర్‌మెహ్తా గుమాస్తావచ్చి వాకిట్లో నిలబడ్డ అశోక్‌తో ''అయ్యా, ఇక్కడ డాక్టరు ఎవరైనా ఉన్నారా ?" అడిగాడు.

''ఏమిటిసంగతి ? ఏం జబ్బు ?'' అడిగాడు.

''అమ్మగారికి జ్వరం"

"నేనువస్తాను పద"

అతడితో వెళ్ళాడు. స్టెత్, బి.పి ఏపరేటస్, థర్మామీటర్ సిరెంజి వంటి వన్నీ ఉన్న పెట్టెపట్టుకుని, ఏళ్ళకొద్దీ అనుభవంగల డాక్టరుగా-లేతముఖంతో-గంభీరమైన చూపులతోవెళ్లాడు.

"డాక్టరుగారూ ? ఈమె మా తల్లి నిన్నటినుంచీ జ్వరం తీవ్రంగా ఉందండీ. మూసినకన్ను తెరవలేదు.'' అన్నాడు మెహ్తా అదుర్దాతో.

బ్లడ్ప్రెషర్ చూశాడు. అతడు చేతికిపట్టీ బిగించి చూసేటప్పుడూ, రోగికి థర్మామీటర్ నాలుకక్రింద పెట్టి చూసేటప్పుడు, చాలా అనుభవం కలవాడిగా, స్టెత్‌తో ఊపిరితిత్తులను పరీక్ష చేసేటప్పుడూ మెహ్తా ఆశ్చర్యంతో చూస్తున్నాడు. డాక్టరు తన సామాను పెట్టెలో పెట్టుకుని. ''రెండు రకాల మందులు రాస్తు

న్నాను. తెప్పించి రోజుకు రెండు మాత్రలు ఇవ్వండి. రెండురోజులయిన తరువాత ఎట్లా ఉన్నదీ చెప్పిపంపండి. నేను వచ్చిచూస్తాను." అంటూ పెట్టెపట్టుకుని లేచాడు

"డాక్టరుగారు మీ ఫీజు ?"

"ఇరవైఅయిదు రూపాయలు"

మెహ్తా లోపలికివెళ్ళి డబ్బు తీసుకువచ్చి ఇచ్చాడు. అతడు జేబులో పెట్టుకుంటూ ''వస్తాను'' అంటూ ఠీవిగా నడిచివెళ్ళాడు.

"డాక్టరు చిన్నవాడే. కారులో పంపకపోయావా ?''

''డ్రైవరులేడు. నాకు చెయ్యి నొప్పని తెలుసుగా నీకు ?'' అన్నాడు మెహ్తా.

''అవును కదూ ? మర్చిపోయాను. ఈసారి డ్రైవర్ని ఉండమని చెప్తాను" అన్నది ఆమె.

మరునాటికి ఆమెకు కొంచెం జ్వరం జారినట్టుంది-లేచికూర్చుని కాఫీ తాగింది. డాక్టర్ చీటిమీద రాసినట్టుగా బ్రెడ్‌తిని మాత్రవేసుకుని పడుకుంది. ఆ రోజు క్రిందటి రోజుకంటె కూడా జ్వరంతగ్గి ఆమె తేటగా కనుపించింది. సాయంత్రం ఐదుగంటలకు గుమాస్తా వెళ్ళి మెహ్తాతల్లికి జ్వరం తగ్గిందనిచెబుతూ "మిమ్మల్ని రమ్మన్నారండి" అన్నాడు.

డాక్టరు లోపలికి వెళ్ళి డ్రెస్ చేసుకుని పెట్టె పట్టుకునివచ్చాడు. జ్వరం చూశాడు. బ్లడ్‌ప్రషర్ ఊపిరితిత్తులు పరీక్షించాడు.

"ఇంకా రెండురోజులు ఈ మాత్రలు వాడండి." అంటూ ఇంకొక రకం రాసిచ్చాడు.

"విశ్రాంతి తీసుకోండి." అనిచెప్పి తన ఫీజు తీసుకుని వెళ్ళిపోయాడు.

డాక్టరు చెప్పినట్టు ఆమె మాత్రలు వేసుకున్నది. కొద్దిగా భోజనం కూడా

చేసింది. పడుకుని లేచిన తరువాత "చాలా తేలికగా ఉంది'' అనుకుంది. ఎక్కువగా తిరగవద్దన్నాడు కనుక పడుకునే ఉంది.

"అబ్బాయీ, డాక్టరుగారికి నీ చెయ్యి చూపించలేదేం ?" అడిగింది.

"ఆయన వచ్చినప్పుడు జ్ఞాపకం రాలేదు." అన్నాడు.

టిల్లూ ఇంటికి వెళ్ళగానే తల్లితో చెప్పాడు.

"నేను ఒక రోగికి వైద్యంచేసి ఏభయి రూపాయలు సంపాదించానమ్మా. ఈ డబ్బు తీసుకో." ఆమె చేతికి ఇవ్వబోయాడు టిల్లూ.

"నీ మొదటి సంపాదన. దాచిపెట్టుకో ఖర్చుపెట్టకు. విదేశాలకు వెళ్ళేటప్పుడు నీకే పనికివస్తుంది" అన్నది అతడి తల్లి.

విదేశాలనుండి అతడికి జవాబురాలేదు. అతడందుకు కించపడలేదు. తను చదివిన కాలేజీలోనే ఆపరేషన్ చేయటానికి అర్హతనిచ్చే డిగ్రీ యం. యస్.కోసం దరఖాస్తు పెట్టాడు. దానికి అనుమతి లభించగానే దానిలో చేరాడు. అది చదువుతూ ఉండగా సుధీర్ మెహ్తా దగ్గరనుంచి మళ్ళీ గుమాస్తావచ్చాడు. "మా అయ్యగారు లేవలేకుండా ఉన్నారు, చెయ్యి నొప్పిట" అని.

అశోక్ వెంటనే పరుగు పరుగున వెళ్లాడు. ఆయనను తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళి తన ప్రొఫెసర్‌కి చూపించాడు.

వెంటనే ప్రొఫెసరు ఎక్సురే తీయించి "నీవు బాగాచూసి విరిగిన ఎముకలు ఎట్లా ఉన్నాయో చెప్పు" అన్నాడు.

అశోక్ బాగా పరీక్షగా చూసి "విరిగిన ఎముకలు ఉండవలసిన క్రమంలో లేవు. పెద్ద ముక్క ఉండవలసినచోట చిన్నది ఉన్నది. అందుచేత ఒకదానికొకటి సరిగా కలవక నొప్పివస్తోంది కదా ప్రొఫెసర్" అన్నాడు.

"నీవు సరిగా కనిపెట్టావు. కనుక మనం సరిగా పేర్చి ప్లాస్టర్ వెయ్యాలి. ఇదివరకుకూడా వాళ్ళు అట్లాగే చేసిఉంటారు. కాని చేతిని ఏ విధంగా కాపాడాలో అట్లా కాపాడలేదు. ఒక సన్నటిబట్టను తీసుకుని మెడకు హారం వేసినట్టువేసి దగ్గరగా ముడివేసి చేతిని దానిలోదూర్చాలి. అప్పుడు చెయ్యి కదలకుండా ఉంటుంది.

వేలాడతీస్తే నొప్పిగా ఉంటుంది. మనం పేర్చిన ఎముకముక్కలు క్రమంగా ఉన్నాయి కనుక అవి సరిగా అతుక్కుంటాయి. నేను చూస్తూఉంటాను. నీవు ఈ పని సరిగా చెయ్యి" అన్నాడు, ప్రొఫెసరు.

అశోక్ సుధీర్ మెహ్తాకు ఆపరేషన్ చేసి ఎముకలను సరిగా పేర్చి కుట్లువేసి ప్లాస్టర్ వేశాడు. ప్రొఫెసరు చెప్పినట్టుగా మెడకు ఒకబట్టను వదులుగాకట్టి చేతిని దానిలో పెట్టాడు. ఒకరోజు హాస్పిటల్లో ఉంచి తరువాత ఇంటికి తీసుకువచ్చాడు. మళ్ళీ దాని పరిమితి ఎన్నిరోజులు ఉంచాలో ఉంచి ప్లాసరుతీసి ఎక్సరే తీసి చూశాడు.

''ఇప్పుడు చూడు అశోక్ ఎట్లాఉందో ?"

"సరిగాఉంది సర్''

"గుడ్, ఈయనకు ఫిజియోథిరపీ ఇక్కడే ఇవ్వు. రెండు వారాలపాటు. నొప్పితగ్గకపోతే మరొకవారం ఇవ్వు'' అన్నాడు.

సుధీర్ మెహ్తాకు చేతిబాధ క్రమంగా తగ్గిపోయింది. ఇంటికివెళ్ళిన తరువాత కూడా వాళ్ళుచెప్పిన ఎక్సర్సైజు మెల్లగా చేయసాగాడు. తరువాత నొప్పి లేకుండా చెయ్యి చాపటం ఎత్తటం కూడా వచ్చింది.

ఇంటికి వెళ్ళినా జాగ్రత్తగా ఆ చేతితో బరువు పట్టకుండా కాపాడు కున్నాడు మెహ్తా.

చూస్తూఉండగానే అశోక్ ఎం. ఎస్ అయిపోవచ్చింది. సుధీర్ మెహ్తా అశోక్ని ఒకరోజు భోజనానికి పిలిచాడు. అతడు రాగానే "మీ కష్టానికి తగిన ఫీజు ఇవ్వాలనుకుంటున్నాను, ఎంతచెప్పండి ?"

అశోక్ సుధీర్ మెహ్తా ముఖం బాగా చూశాడు. హాస్పిటల్లో ఆపరేషన్ చేసి నప్పుడు అతడు మత్తులో ఉండగా కూడా పరీక్షగాచూశాడు. అతడికి అనుమానం కలిగింది.

"రేపు మా యింటికి భోజనానికి రండి. ఆలోచించి నా ఫీజెంతో చెప్తాను" అన్నాడు.

"నాకు దారి తెలియదు. మా కారు రిపేరయివచ్చింది. డ్రైవరు వెళ్ళిపోయాడు. అంటే నేనే తీసేశాను. మీరు కారునడపగలరా?''

"ఆఁ. విదేశాలకు వెళ్ళాలని డ్రైవింగ్ నేర్చుకున్నాను. నాకు కారులేదు. డబ్బులేనివాడిని కదా. అక్కడినుంచి వచ్చిన తరువాత కొనుక్కుంటాను''

"అయితే మీరువచ్చి తీసుకువెళ్ళండి''

మరునాడు అశోక్‌మెహ్తా సుధీర్ వాళ్ళ కారు డ్రైవ్‌చేస్తూ తనయింటికి తీసుకువెళ్ళాడు.

బల్లమీద అన్నీ తయారుపెట్టి అతిథికోసం ఎదురుచూస్తున్న చంద్రికకారు శబ్దంవిని తలుపు తెరిచిచూసింది.

గడ్డం పెరిగిన సుధీర్ మెహ్తాను చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకువస్తున్నాడు టిల్లూ.

"అమ్మా, ఈ మెహ్తాగారికే నేను చేతికి ఆపరేషన్ చేసి నొప్పిలేకుండా చేసింది. అంతకుముందు వీరి తల్లిగారికి జ్వరం నయంచేస్తే ఏభయి రూపాయలు ఫీజుగా ఇచ్చారు. నేను నిన్న వీరింటికి పిలిస్తే భోజనానికి వెళ్ళాను. ఇవాళ మన యింటికి ఆహ్వానించాను. వాళ్ళ కారులోనే తీసుకువచ్చాను అన్నాడు.

సుధీర్ మెహ్తా భోజనాల యింట్లో కుర్చీమీద కూర్చుని భోజనంచేశాడు. మౌనంతో అక్కడే నిలబడి కావలసినవి వడ్డించింది చంద్రిక.

వాళ్ళిద్దరూ భోజనంచేసి అవతల గదిలోకి వెళ్ళగానే చంద్రిక భోజనంచేసి వాళ్ళున్న గదిలోకి వచ్చింది.

చంద్రిక అతడు చూసినప్పటికంటె కొంచెం లావయిందిగాని పోలికలు ఎక్కడికిపోతాయి? అశోక్ ఎదుట ఆమెను ఎట్లా పలకరించాలా అని ఆలోచిస్తున్నాడు సుధీర్‌మెహ్తా.

అశోక్ ''అమ్మా, నేను మూడుగంటలకు హాస్పిటల్‌కి వెళ్ళాలి. వీరిని వాళ్ళయింట్లో దింపివెళ్తాను ఫీజు ఎంతతీసుకోమన్నావు? చెప్పు" అన్నాడు.

సుధీర్ మెహ్తా ఆమెను గుర్తుపట్టినా ఫీజు సంగతి ఎట్లా పరిష్కారమవుతుందీ అని ఆలోచిస్తున్నాడు.

ఆమె కూడా అతడిని కారులోనుంచి దిగుతుండగానే గుర్తుపట్టింది. మాట్లాడటానికి సమయమూ సందర్భమూ రావాలికదా అనుకుంది.

"టిల్లూ, నీవు వాళ్ళు కాదన్నా నీ బాధ్యతను నీవు నెరవేర్చావు. నాకు చాలా ఆనందంగా ఉంది. నీవు అదృష్టహీనుడివి. నేను వారింట పాదంమోపటానికి వీలుగాని దురదృష్టవంతురాలిని. మనిద్దరం విధి విసిరివేసిన వాళ్ళుగా బ్రతికాం. నేను కన్నతల్లిని కనుక నా నెలవంకను నేను విడిచిపెట్టుకోలేక నిన్ను పెంచి ఇంతవాడిని చేశాను. మనం వారివద్దనుండి ఫీజు తీసుకొనగల వాళ్ళమా ? కాదు'' అన్నది.

"చందూ, నీవన్న మాటల్లో తప్పులేదు. తప్పంతా నాది. ఈ చిన్నవాడు నాకొడుకని అనుకుంటే ఫీజుగా ఏబయి రూపాయలిస్తానా ? నా యావదాస్తినీ నాతో కూడా అర్పించుకునేవాడిని. వాడు అదృష్టజాతకుడు కాదని ఎవరయినా అనగలరా ? అన్నవాళ్ళను నీవిశాల హృదయంతో క్షమించు. నేను అనకపోయినా నిజం తెలుసుకోలేని అసమర్థుడిని. అదే నేనుచేసిన పెద్ద నేరం. టిల్లూని నేను విదేశాలకు పంపుతాను. ఎవరో డబ్బివ్వటం నేను చూడలేను. కారెక్కు ఇంటికి పోదాం" అన్నాడు సుధీర్ మెహ్తా.

"మెహ్తాగారూ ! మీయింట పాదంపెట్టటానికి నాకు రెండేపాదాలు. వాటికి అదృష్టంలేదు. మీరే వస్తూఉండండి. ఈ కుటీరాన్ని పిల్లవాడితో ఉండటానికి నేను నిర్మించుకున్నాను. ఈ కుటీరాన్ని వదలను. ఇక్కడ ఉన్నన్నిరోజులూ అశోక్ నాదగ్గరే ఉంటాడు. నేను కనిపెంచిన కొడుకు" అన్నది.

"అమ్మా, టైమయింది. అక్కడ మెహ్తాగారి తల్లికూడా నేను కనిపెంచిన కొడుకు నా దగ్గరే ఉండాలని అనదూ ?'' అన్నాడు నవ్వుతూ.

''ఉండనీ, ఆమెకొడుకు ఆమెదగ్గరే ఉంటాడు. గతించినజీవితం జ్ఞాపకం ఉంటే ఆయనే ఎప్పుడైనా ఈ కుటీరానికి రావచ్చు.''

"ఆఫీసు వేరేపెడతాను. నా సెక్రెటరీగా రావచ్చు కదా. నీచెయ్యిలేనిదే వ్యాపారం బాగా సాగటంలేదు." అన్నాడు అర్థింపుగా మెహ్తా.

''మెహ్తాగారూ, పాదం మంచిదికాదు కాని చెయ్యి మంచిదవుతుందా ?"

"అమ్మా, నేను వెళ్ళిపోతానుగా. ఈ యింటినే ఆఫీసుగా చేసుకోండి. నీవు వెళ్ళద్దుగాని-ఆయనను రానివ్వు'' అన్నాడు. ఇద్దరి బుజాలమీద చేతులువేస్తూ "అమ్మా నాకు నాన్నా దొరికాడు."

'ఒ,కే. టిల్లూ." అన్నారిద్దరూ బింకాలు వదలి.